తుడ్చుకుంటూ వెనకోచేయి ఆ బాధను వోర్చుకోవటానికి నోట్లోని గుడ్డదాయి నొకచేతా పట్టుకుని ఒక్క చోట కూడా క్షణం నిలువలేని స్థితిలో వరుగులు తీస్తూ మంటల నుండి ఉపశమన మందటానికి బురదను మేనెల్లా మెత్తుకుని, అదీ దొరకనప్పుడు మలమూత్రాన్ని శరీరానికి పులుముకుంటూ ఎవరికీ కనిపించకుండా తిరుగుతాడు విదురుడు.

నారదమహర్షి ద్వారా ఈ సంగతి విన్న యుధిష్ఠిరుడు యేకాంతంగా విదురుని కలుసుకున్నప్పుడు, తనలోని జీవాత్మను ధర్మరాజు దేహంలోకి ప్రవేశపెట్టి హాయిగా కట్టెలా (నొప్పిలేక) పడిపోతాడు. అతని అవతారం చూసి అర్థం చేసుకున్న ధర్మజుడు కన్నీరు కార్చి వేదజ్ఞానంతో బ్రహ్మత్వం పొందిన శూద్రుడికి అగ్ని సంస్కారమే చేయిస్తాడు. విదురుడు శాపగ్రస్తుడు ధర్మజుడు ఇష్టాపుత్రుడైన వరపురుషుడు.

డాక్టర్ ఆర్.కె.బిజ్జల
మునీరాబాద్

# పెళ్లి పందిరి

## చుండూరి గణేష్

అప్పుడే కురిసి వెలసిన వర్షం తాలూకు నీటి బిందువులు, లేత సూర్య కిరణ కాంతిలో పచ్చటి ఆకుల మీద నుంచి జారిపడి మంచు ముత్యాల్లా మెరుస్తూ వింత శబ్దాన్నిస్తున్నాయి.

రేడియోలో సుప్రభాతం వినిపిస్తూంది. నెమ్మదిగా లేచి కిటికీ దగ్గరగా వచ్చి బయటకు చూస్తూ నిలబడ్డాను.

చెట్ల కొమ్మలను తప్పించుకుని సూర్య కిరణాలు గదిలోకి ప్రసరిస్తున్నాయి. ప్రకృతి చెప్పలేనంత అందంగా ఆనందంగా ఉంది.

"వాసుకీ!" అన్న పిలుపుకు ఉలిక్కి పడి వెనక్కి చూశాను.

అమ్మ గదిలోకి వస్తూ, "లేచావా తల్లీ ఈ రోజు మీనాక్షి పెళ్ళి. తొందరగా తెములు. రాత్రి తొమ్మిది గంటలకు పడుకున్న దానివి ఇప్పుడా లేచేది. అప్పుడే మూడు ఫోన్లు వచ్చినాయి. నా దయిపోవచ్చింది. టేబుల్ మీద కాఫీ పెట్టాను. ముఖం కడుక్కుని తీసుకో" అన్నది.

"పొద్దుటే కోప్పడకమ్మా! పావు గంటలో తయారైపోనూ?" చప్పున అమ్మను తప్పించుకుని బాత్‌రూమ్ కేసి నడిచాను.

"ఇంకా అవలేదూ" అంటూ అమ్మ మళ్లీ వచ్చింది.

"అయిపోయిందమ్మా!" చివరి సారి అన్నట్టు మరోసారి అద్దంలో నన్ను నేను చూసుకుని, ముంగురులు సవరించుకుని, నాలుక బయట పెట్టి నా ప్రతి బింబాన్ని వెక్కిరించి, చకచకా మేడమెట్లు దిగి కిందికి వచ్చాను.

"మీనాక్షికి కూడా పెళ్ళయిపోతోంది" సంతృప్తిగా నా వంక చూస్తూ అమ్మ మొదలు పెట్టింది.

"అయితే అవనీ. అమ్మా! ఇదే నీకు ఆఖరి సారి చెబుతున్నాను. నన్ను నన్నుగా అభిమానించి నా దగ్గరికి వచ్చిన వాళ్ళనే నేను చేసుకుంటాను. నేనెవరి దగ్గర బొమ్మలా కూచుని ఆ చూపుల తంతు భరించలేను. నాకు పెళ్ళి కాకపోయినా పరవాలేదు సరా? అంతదాకా ఇంతే!

"సరే! ఇంక ఈ జన్మకు నీ పెళ్ళి నేను చూసినట్టే" నిట్టూర్చింది.

ఏ పెళ్ళికి వెళ్ళుతున్నప్పుడైనా ఇదే రకం ప్రశ్న వేస్తుంది అమ్మ. నేనూ అదే రకం సమాధానం చెబుతూ వస్తున్నాను. నన్ను నన్నుగా అభిమానించి, ధనానికే కాక వ్యక్తిత్వానికి విలువనిచ్చే వ్యక్తి కోసం నే నెదురు చూస్తూ ఉన్నాను. నా ఆశయాల్ని సఫలం చేస్తూ వచ్చే వారెవరూ లేనేలేరా? ఇటీవల ఇదే ప్రశ్న నా మనసులో కూడా ఉద్భవిస్తోంది. కానీ అమ్మలా నేను బయట పడడంలేదు ఇద్దరి మనసుల్లో ఒకటే ఆలోచన.

పెళ్ళి పందిరి సమీపించడంతో చప్పున ఆలోచనలు కట్టి పెట్టి ముందుకు నడిచాను. అమ్మ సాయం చేయాలంటూ లోపలికి వెళ్ళిపోయింది. మీనాక్షి తల్లి, అమ్మ వరసకు వదినా మరదళ్ళు అవుతారు. ఒకే ఊళ్ళో ఉండడం వలన రాకపోకలు కూడా ఎక్కువే! మీనాక్షి పెళ్ళి నాలుగు రోజులైన తన ఇంట్లోనే ఉండి పొమ్మని' అంటే అమ్మ సరేనంది కానీ, అక్కడే ఉండి పోలేదు. అమ్మకి ఇంకా మొహమాటమే ఎందుకు వెళ్ళలేదంటే "నీ పెళ్ళి గురించి అడుగుతారు. సవాలక్ష ప్రశ్నలు వేస్తారు. నీ సిద్ధాంత లేం వాళ్ళకి నచ్చవు" అంటూ "నీ వల్లే మానేశా" నంటుంది.

మీనాక్షి అప్పుడే వచ్చి పెళ్ళి పీటల మీద కూర్చుంది. అర క్షణం పాటు మీనాని చూశాను. పెళ్ళి కూతురు ముస్తాబుతో మరింత అందంగా ఉంది. బుగ్గన చుక్క కొత్త అందాన్నిస్తుంది. అమ్మ మాటలు గుర్తొచ్చాయి. "నా పెళ్ళి ఎప్పుడు?" అని అనిపించింది.

మాంగల్యధారణ పూర్తయింది. అక్షింతలు వేసిదగ్గర్లో కుర్చీలని చూసి, నేను కూర్చోడానికి ఎక్కడేనా ఖాళీ లున్నాయా అనుకుంటూ కుర్చీలకేసి నడిచాను. ఊహు! ఒక్కటి కూడా ఖాళీలేదు. వేలికి చీర కొంగు చుట్టుకుంటూ ఆలోచిస్తూ దూరంగా నిలబడాను.

"హలో!" అంటూ అపరిచిత స్వరం వినపడడంతో వెనక్కి తిరిగి చూశాను.

ఫుల్ సూటులో కళ్ళు చికిలిస్తూ నిలబడ్డ అతనెవరో ఎంతకీ నా కర్థం కాలేదు. కలలో మనిషి ఇలలో కొచ్చాడా అనిపించింది. తప్పని సరై నేనూ "హలో" అన్నాడు.

"రా! వాసుకీ! అక్కడ కూర్చుందాం" చనువుగా పిలుస్తూ అన్నాడతను.

"ఫోర్నీ! వీడెవడో పేరు కూడా పట్టేశాడు. వీడి సంగతి ఏమిటో తేల్చుకోవాలి" అనుకుంటూ అతని వెనకాలే నడిచాను. కుర్చీలో కూర్చోగానే ప్రాణం లేచి వచ్చింది.

ఎవరో కుర్రాళ్ళిద్దరు డ్రింకులు సప్లై చేస్తున్నారు. పిలిచి రెండు తీసుకుని తానొకటి పుచ్చుకుని, నా కొకటిస్తూ చిన్నగా నవ్వాడు.

"థేంక్స్" అంటూ తీసుకున్నాను. అతడు డ్రింక్ తాగుతుంటే అతని వంక చూశాను. పసిమిఛాయలో ఎత్తుకు తగ్గ లావుతో విశాలమైన నుదురుతో సుందరంగా ఉన్నాడి. 'నా భర్త ఇలా ఉంటాడా' అనిపించింది. డ్రింకు పూర్తయింది. ఏమీ మాట్లాడడు. పెళ్ళికొడుకు తరఫువాడో పెళ్ళి కూతురి తరఫువాడో అర్థం కాలేదు. వినుగెత్తి చివరికిలా అన్నాను.

"చూడండి మీ రెవరో నాకు తేలీదు. కానీ ఎడారిలో ప్రయాణం చేసే వారికి ఒయాసిస్సులా, కాళ్ళు పీక్కుపోయి, తల తిరుగుతుందేమో అనుకుంటున్న సమయంలో నా క్కనిపించి కూర్చో పెట్టి డ్రింకిచ్చారు. చాలా సంతోషం. వస్తానండీ!" అంటూ రెండు చేతులూ ముకుళించి వెనక్కి తిరిగాను.

"వాసుకీ"

అతని నాలుక చివర నా పేరు ప్రాణం పోసుకుందా అనిపించింది చప్పున వెనక్కు తిరిగాను నేను.

"గుర్తు లేనా నేను? నిజంగా?" గువ్వలా కువకువలాడిందతని కంఠం

కొద్దిగా గడ్డం పైకెత్తి అతని వంక మరోసారి స్పష్టంగా చూశాను. నా ముఖంలో భావాలు చదవడానికి సిద్ధంగా కనిపిస్తున్నాడతను. "ఎప్పుడో చూశాను" అనిపించే సరికి బిడియం వదిలి నిస్సంకోచంగా అతని ముఖం కేసి మరింత పరిశీలనగా చూశాను.


తనని కింది నుంచీ మీది వరకూ చూస్తున్నానని కాబోలు, అతను చిన్నగా నవ్వు కుంటున్నాడు. తళుక్కుమన్న తెల్లని పలు వరుస నాలో ఏదో భావాలు స్ఫురింపజేసింది. బాగా తెలిసిన వాడేనే! కానీ గుర్తుకు రావడం లేదు. ఎవరబ్బా? ఆలోచనకి అందడం లేదు.

"అమ్మ బావున్నారా?" ప్రశ్నించాడతను.

"బాగానే ఉన్నారు" ఆలోచనని తెంపుతూ జవాబిచ్చాను.

"ఇక్కడికి వచ్చారా?"

"వచ్చారు" నీరసంగా సమాధానం ఇచ్చాను.




"అన్నయ్య ఎప్పుడొస్తాడు?"

"ఏ అన్నయ్య? నా కిద్దరన్నయ్యలు"

"ఆ సంగతి తెలుసు నే నడిగేది సుభాష్ సంగతి"

"చిన్నన్నయ్యా? ఆగస్టులో లీవ్ పెట్టుకుని వస్తానన్నాడు"

ప్రశ్నలైపోయినట్టు అతను మౌనం వహించాడు. అందరి గురించీ అడుగుతున్నాడంటే కుటుంబ స్నేహితుడయి ఉండాలి. సుభాష్ గురించి అంటే తన క్లాస్‌మేటా? ఎవరు? ఈ ఆగంతకుడి సంగతి తేల్చుకోందే ఈ ప్రదేశం విడిచి వెళ్ళకూడదని బలంగా అనిపించసాగింది.

"నువ్విప్పుడేం చేస్తున్నావ్ వానూ!"

"వానూ" అని నన్ను పిలిచేది సారధి. మీనాక్షి అన్నయ్య సారధి. ఇతనెప్పుడొచ్చాడు? సారధి చంపుకు తిన్నావు' అనుకున్నాను.

"గుర్తొచ్చానా" ముఖంలో భావాలు చదువుతూ అన్నాడు.

"నువ్వు... మీరు... సారధి కదూ!"

"అవును" అన్నాడతను ఏదో బరువు దించుకున్నవాడిలా "నన్ను నేను పరిచయం చేసుకోవటం ఇష్టం లేకపోయింది. నన్ను గుర్తించుకుంటావో లేదో అని. మొత్తానికి గుర్తొచ్చాను" నవ్వాడు సారధి.

"మీరు ఫారిన్ నుంచి ఎప్పుడొచ్చారు? మీ రొస్తున్నట్టు మా కెవరికీ తెలీదు. ఏడు సంవత్సరాల నుంచీ ఒక్క ఫోటో కూడా పంపక పోతే అప్పటి సారధి ఇతనే అని ఎలా గుర్తు పెట్టుకోను?' గోముగా అడిగాను.

"చెల్లి పెళ్ళి రావాలి అంటూ ఏవో డైలాగులు రాసింది. వస్తున్నట్టు చెప్పకుండా వద్దామని ఎవరికీ చెప్పకుండానే వచ్చాను చిన్నప్పటి సంగతులు గుర్తున్నాయా?" అడిగాడు.

"ఏం సంగతులు? చాలా ఉన్నాయిగా!" అన్నాను. తిరిగి కుర్చీలో కూర్చోబోతూ ఎంత మారిపోయాడు అనుకున్నాను.

"అదే మన బొమ్మల పెళ్ళి సంగతులు" నవ్వు దాచుకుని పరిశీలనగా నా ముఖంలోకి చూస్తున్నాడు సారధి.

చప్పున తల దించుకున్నాను. బుగ్గలు ఎర్ర బడ్డాయి. పెదాలు అదురుతున్నాయి. కుర్చీ లోంచి లేస్తుంటే నా చెయ్యి అందుకుని చిన్నగా ముద్దు పెట్టుకుంటూ "ఆ పెళ్ళి నిజం చేసేద్దామా?" అన్నాడు.

"నీ ఇష్టం" అన్నట్టు తలూపుతూ పెళ్ళి పందరిలోకి వచ్చేశాను. ఆ పందరి నాకు పెళ్ళి పందిరిలా అనిపించసాగింది. చప్పున అమ్మకు దగ్గరగా వెళ్ళి నిలబడిపోయాను.

పది రోజుల తర్వాత సారధి నా భుజం చుట్టూ చేతులు వేసి దగ్గరగా తీసుకుంటూ "నేను మీనా పెళ్ళి కోసం రాలేదన్న మాట! నా పెళ్ళి కోసం వచ్చినట్టుంది కదూ? అప్పటి పెళ్ళి నిజం అవుతుందను కోలేదు" అన్నాడు నా వంక చూస్తూ.

అతని గుండెల్లో ఒదిగిపోతూ "నేను మాత్రం అనుకున్నా" మృదు మధురంగా అన్నాను.

★